క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయ పెద్దలకు విరాళాన్ని అందజేస్తున్న విశ్వబ్రాహ్మణ నరసింహాచారి దంపతులు

పెద్దకడబూరు : మండల కేంద్రంలోని స్థానిక మల్లికార్జునస్వామి ఆలయ సమీపంలో నిర్మాణం చేపట్టిన రజకుల కులదైవం మడివేలి మాచదేవ ఆలయ నిర్మాణానికి స్థానిక లక్ష్మమ్మవ్వ దేవి ఆలయ పూజారి విశ్వబ్రాహ్మణ నరసింహాచారి దంపతులు శుక్రవారం ఆలయ పెద్దలకు విరాళాన్ని అందజేశారు. నరసింహాచారి మాట్లాడుతూ మండల కేంద్రంలోని అన్ని కులాలకు సంబంధించిన ఆలయాలు ఉన్నాయన్నారు. అదేవిధంగా రజకుల కులదేవం అయిన మడివేలి మాచదేవకు ఆలయం లేకపోవడం, రజకులంతా ఏకమై ఆలయ నిర్మాణానికి పూనుకోవడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. మండల ప్రజలు, కులస్తులే కాక ఇతర మండలాల ప్రజలు, ఇతర కులస్తులు విరివిగా విరాళాలను అందజేయాలని కోరారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

ఎమ్మిగనూరుటౌన్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జిల్లా సహాయకార్యదర్శి ఎన్‌పీఎం సాహెబ్, డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ఎం రఫీక్, ముస్తాక్ అహమ్మద్ డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక డిపో ఎదుట ప్ల కార్డులు పట్టుకొని నినాదాలు చేస్తూ ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ఎంఎల్ రెడ్డి, షరీఫ్, పీకే వలి, బాషా, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

ఆదోని టౌన్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదోని ఆర్టీసీ డిపో ఎదుట ఆర్టీసీ ఉద్యోగుల సంఘం నాయకులు శుక్రవారం కూడా నిరసన కొనసాగించారు. నాయకులు ఆరోగ్యప్ప, వర్కింగ్ ప్రెసిడెంట్ బసవరాజు, రామలింగప్ప , చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి కృషి చేయండి



మాట్లాడుతున్న జడ్జి పి.జె.సుధ

ఆదోని రూరల్: లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారానికి పోలీసు అధికారులు కృషి చేయాలని ఆదోని రెండో అదనపు జిల్లా జడ్జి పి.జె.సుధ, సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞ నారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక కోర్టు ప్రాంగణంలో ఆయా పోలీస్‌స్టేషన్ల పోలీసు అధికారులతో సమావేశమై మాట్లాడారు. మే 10న స్థానిక కోర్టులో జాతీయ మెగా లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసుల పరిష్కారానికి కక్షిదారులతో మాట్లాడి కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు.

ఆదోనివాసికి అవార్డు



బూదూరు శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న సోమలరాజు ఫౌండేషన్ అధినేత శివరాజు

ఆదోనిఅర్బన్/ఆదోని రూరల్: పట్టణానికి చెందిన బూదూరు శ్రీనివాస్ ఏపీజే అబ్దుల్‌కలాం అవార్డును అందుకున్నారు. శుక్రవారం చిత్తూరు నగరంలో విజయం ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో అంబేడ్కర్ జయంతి, ఉగాదిని పురస్కరించుకుని వివిధ రంగాల్లో పనిచేసిన సామాజిక సేవాకర్తలను గుర్తించిన కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నగరానికి చెందిన సోమలరాజు ఫౌండేషన్ అధినేత శివరాజు ఈ అవార్డును అందించారు.

ఆస్తి పన్ను చెల్లించి రాయితీ పొందండి

ఆదోని టౌన్: మున్సిపాలిటీ పరిధిలో ఈనెలాఖరులోగా ఆస్తి, నీటి పన్ను చెల్లించి వడ్డీపై 50 శాతం రాయితీ పొందాలని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ ప్రజలను కోరారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికిగానూ పన్ను బకాయి ఉన్న వారు ఈనెల 30వ తేదీలోగా చెల్లించినట్లయితే రాయితీ వర్తిస్తుందన్నారు. అలాగే 2025–26 పన్నులను ఏకకాలంలో చెల్లించినట్లయితే 5 శాతం రాయితీ వర్తిస్తుందని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మున్సిపల్ కార్యాలయంలో సెలవు దినాల్లో కూడా పన్ను వసూలు కౌంటర్‌లు అందుబాటులో ఉంటాయన్నారు.

పీడిత జన బాంధవుడు జ్యోతిరావు పూలే

పెద్దకడబూరు : పీడిత జన బాంధవుడు జ్యోతిరావు పూలే అని ఫోరం ఫర్ ఆర్టీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బొగ్గుల తిక్కన్న, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఎంపీ యువరాజు, బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు సామేలు అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే జయంతిని పెద్దకడబూరుతో పాటు జాలవాడి గ్రామాలలో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి

కౌతాళం: మండల పరిధిలోని ఎరిగేరి జెడ్పీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో స్కౌట్స్ విద్యార్థులు పాఠశాల నుంచి గ్రామంలోని పూలే విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి, ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వ్యాయమ ఉపాధ్యాయుడు రాము, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదోని రూరల్: స్థానిక ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఆదోని ఎమ్మార్పీఎస్ మాజీ మండల గౌరవాధ్యక్షులు బైచిగేరి తిమ్మన్న మాదిగ, దిబ్బనకల్ ఉసేనప్ప మాదిగ మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మాదాసు, జగన్, గుమ్మల బాలస్వామి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లలో కేవీపీఎస్, సీఐటీయూ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. గోనెగండ్ల బస్టాండ్‌లో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు మారేష్, బాబు, రాజు, వలి, సురేష్, మున్నా తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు



గోనెగండ్లలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పూలే జయంతి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో శుక్రవారం మహాత్మా జ్యోతిరావ్‌పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం అధికార ప్రతినిధి గడ్డం లక్ష్మీనారాయణరెడ్డి, చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి మాచాని వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు ఎంకే శివప్రసాద్, అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, మైనారిటీ నియోజకవర్గ అధ్యక్షుడు ఖాశింబేగ్, పట్టణ ఉపాధ్యక్షుడు కోటకొండ నరసింహులు, పట్టణ ప్రధాన కార్యదర్శి కొరిశెట్టి విశ్వనాథ్‌తో పాటు పార్టీ శ్రేణులు పూలమాల వేసి నివాళులర్పించారు.



ఎరిగేరి జెడ్పీ పాఠశాలలో నివాళులర్పిస్తున్న స్కౌట్స్ విద్యార్థులు



పెద్దకడబూరులో నివాళులర్పిస్తున్న ఫోరం ఫర్ ఆర్టీ జిల్లా ప్రధానకార్యదర్శి బొగ్గుల తిక్కన్న



ఆదోనిలో నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆదోని అర్బన్: రెండో శనివారం సందర్భంగా విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ఆదోని పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏడీఈ పురుషోత్తం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు ఆదోని నియోజకవర్గం మొత్తం విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

కరువును పట్టించుకోని ప్రభుత్వం

ఎమ్మిగనూరుటౌన్: కరువుతో అల్లాడుతున్న రైతాంగాన్ని ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని రైతు సంఘ నాయకులు అబ్దుల్లా, లక్ష్మీనర్సయ్య అన్నారు. అఖిలభారత కిసాన్ సభ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని సుందరయ్య భవన్ వద్ద ఆ సంఘ జెండాను సీపీఎం నాయకుడు గోవిందుతో కలిసి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. రైతాంగ, వ్యవసాయ సంబంధ సమస్యల పరిష్కారినికి ఈ సంఘం ఎన్నో పోరాటాలు చేసి హక్కులను సాధించిందన్నారు. కార్యక్రమంలో ఆసంఘ నాయకులు రాముడు, రమేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రైతు సంఘం ఆవిర్భావ దినోత్సవం

ఆదోని రూరల్: ఆదోని పట్టణంలోని కల్లుబావిలో శుక్రవారం ఏపీ రైతుసంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కమిటీ సభ్యులు కె.రామదాసు, సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశు, సీఐటీయూ జిల్లా నాయకులు రామాంజనేయులు పాల్గొన్నారు.

కమనీయం.... వీరభద్రేశ్వరస్వామి కల్యాణం



కల్యాణోత్సవాన్ని వీక్షిస్తున్న భక్తులు

ఆదోని అర్బన్: పట్టణశివారులోని కోట నగర్‌లో వెలిసిన కోట భద్రకాళిసమేత వీరభద్రేశ్వరస్వామి ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ముందుగా భద్రకాళిసమేత వీరభద్రేశ్వరస్వామి వారికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, ఆకుపూజ ప్రత్యేక పూల అలంకరణ, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుద్ర, వీరభద్రకాళి హోమాలు, కుంకుమార్చన జరిగింది. అనంతరం భిక్షాళిమటుమారి పీఠాధిపతులు వీరభద్ర శివాచార్య మహాస్వాములు నూతన మహా ముఖద్వారాన్ని ప్రారంభించారు. అదేవిధంగా కలశ ప్రతిష్టాపన, బసవేశ్వర విగ్రహ ప్రతిష్టాపన చేశారు. అలాగే భద్రకాళిసమేత వీరభద్రేశ్వరస్వామివారికి సంప్రదాయబద్ధంగా కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం మహాగణారాధన పూజలు జరిగాయి. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

కలశ ఊరేగింపు

సాయంత్రం పట్టణంలోని పేట వీరభద్రేశ్వర స్వామి దేవస్థానం నుంచి పట్టణశివారులోని కోట భద్రకాళి సమేత వీరభద్రేశ్వరస్వామి ఆలయం వరకు కలశాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చారు. శనివారం రథోత్సవం ఉంటుందని పట్టణంలో అందరికీ ఆహ్వానంగా డోలు, సన్నాయిల మధ్య కలశాలతో చిన్నారులు, మహిళలు ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. నేడు అయ్య, అమ్మవార్లకు వేకువజామున ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం మహారథోత్సవం, ఆదివారం వసంతోత్సవం ఉంటుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు దేవిశెట్టి మంజునాథ్ తెలియజేశారు.



భద్రకాళిసమేత వీరభద్రేస్వామివారికి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

రోడ్డు ప్రమాదంలో తల్లీకుమారుడికి గాయాలు

ఆదోని అర్బన్: మండలంలోని మదిరె గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్దహరివాణం గ్రామానికి చెందిన నాగమ్మ, ఆమె కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం ఆదోని నుంచి ఆశావర్కర్ నాగమ్మ తన కుమారుడి బైకుపై పెద్దహరివాణం గ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో మదిరె గ్రామ సమీపంలో బైకు అదుపు తప్పి కింద పడడంతో ఇద్దరూ గాయపడ్డారు. స్థానికులు వెంటనే ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఔట్‌పోస్టు కానిస్టేబుల్ తెలిపారు.

వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లును రద్దు చేయాలి

కోసిగి: కేంద్రం ప్రభుత్వం ఆమోదించిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వెంటనే రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిలానీ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయం ఆవరణలో సీపీఐ మండల కార్యదర్శి గోపాల్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఒక్క ముస్లిం ఎంపీ కూడా లేని బీజేపీ ముస్లింల హక్కులను రక్షించేందుకు సవరణ చేపట్టినట్లు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. దేశ వ్యాప్తంగా ఇప్పటికే 50 శాతం వక్ఫ్ ఆస్తులు అన్యక్రాంతం అయ్యాయని, మరలా సవరణ చేసి పూర్తిగా ముస్లింలకు అన్యాయం చేసేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నిందని ఆరోపించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వీరేష్, ఓంకార్ స్వామి, తాయన్న, బాబు, నరసింహులు ఉన్నారు.

ముస్లింల నిరసన

ఆదోని అర్బన్: వక్ఫ్ బోర్డు చట్ట సవరణకు వ్యతిరేకంగా రాయలసీమ ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో స్థానిక దుల్హాపైల్వాన్ మసీదులో శుక్రవారం నమాజు అనంతరం శాంతియు నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మసీద్ ముతవల్లి జిక్రియా మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం నల్ల చట్టాలను తీసుకొస్తుందని, దీనిని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. దేశంలో ముస్లింలను అణచివేయడానికి, వారి ఆస్తులను స్వాధీనం చేసుకోవడానికి వక్ఫ్ చట్టాన్ని మార్చిందన్నారు.

మందుగుండు సామగ్రి తయారీదారుల అరెస్టు

గోనెగండ్ల : మండల పరిధిలోని అలువాల గ్రామంలో అనుమతి లేకుండా మందుగుండు సామగ్రి తయారు చేస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ విజయ భాస్కర్ తెలిపారు. అలువాల గ్రామ శివారులోని పొలంలో రహస్యంగా ఒక ఇంట్లో మందుగుండు సామగ్రి ఔట్లు, చిచ్చుబుడ్లతో పాటు పెద్ద శబ్దంతో పేలే మందుగుండును తయారు చేస్తున్నట్లు సమాచారం అందడంతో శుక్రవారం పోలీసులు దాడులు చేసి సర్కార్ వలితో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేశామన్నారు. వారి దగ్గర నుంచి మందుగుండును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

మండలంలోని నెట్టేకల్ క్రాస్ సమీపంలో చిన్న పెండేకల్ గ్రామానికి చెందిన కురువ కోదండరాముడి వద్ద నుంచి 312 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తాలూకా సీఐ నల్లప్ప శుక్రవారం తెలిపారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి జైలుకు తరలించినట్లు చెప్పారు. దాడుల్లో డీటీ వలీబాషా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నివీర్ దరఖాస్తు గడువు పొడిగింపు

ఆదోని రూరల్: భారత సైనికదళంలో అగ్నివీర్ ద్వారా చేరేందుకు ఆన్‌లైన్ దరఖాస్తు గడువు ను ఈనెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు అమ్మా కాన్సెప్ట్ ఫౌండర్ చిన్నప్ప శుక్రవారం తెలిపారు. అగ్నివీర్ ద్వారా భారత సైన్యంలో చేరేందుకు 17.5 సంవత్సరాల నుంచి 21 సంవత్సరాల మధ్య ఉన్న యువతీ, యువకులు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 9440251373, 8801433611 నంబర్‌లను సంప్రదించాలన్నారు.

వైభవంగా చెన్నకేశవస్వామి కల్యాణం

ఎమ్మిగనూరుటౌన్: మండల పరిధిలోని కడిమెట్ల గ్రామంలో శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. కల్యాణోత్సవంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి నిరుపమా రెడ్డి పాల్గొని హోమంతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ యూత్‌నాయకుడు రాజీవ్‌రెడ్డి, గ్రామస్థులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



హోమం నిర్వహిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

ఎమ్మిగనూరుటౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కర్షక, కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి నాగరాజు అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ సీనియర్ నాయకుడు పైలా వాసుదేవరావు 15వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి సత్యన్న, ఐఎఫ్‌టీయూ నాయకుడు బాలరాజు, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎండి రఫీ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ధర పెంపుపై వినూత్న నిరసన

ఎమ్మిగనూరుటౌన్: కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్ ధరను పెంచడాన్ని నిరసిస్తూ సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం గ్యాస్ సిలిండర్‌కు పాడెకట్టి ఊరేగించి వినూత్నంగా నిరసన తెలిపారు. సోమప్ప సర్కిల్‌కు చేరుకొని రాస్తారోకో చేపట్టారు. సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, మంత్రాలయం నాయకులు భాస్కర్ యాదవ్, సమీవుల్లా మాట్లాడుతూ సిలిండర్‌పై రూ.50లు పెంచడంతో సామాన్య ,మధ్యతరగతి ప్రజలపై భారం పడుతుందన్నారు. వెంటనే గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి వీరమ్మ, చాముండి, బేగం, సీపీఐ నాయకులు కేసీ జబ్బార్, మాలిక్ తదితరులు పాల్గొన్నారు.



వంట గ్యాస్ సిలిండర్‌ను పాడెమీద ఊరేగిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి

ఆదోని అర్బన్: వాస్తవాలు తెలియకుండా బీఎస్పీ నాయకుడు ఫయాజ్‌అహ్మద్ లేనిపోని మాటలు మాట్లాడి తన గౌరవానికి భంగం కలిగించాడని అభ్యుదయ దళితసేవా సంఘం నాయకులు రంగన్న అన్నారు. శుక్రవారం స్థానిక ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సర్వేనంబర్ 559ఏలోని 50 సెంట్ల స్థలాన్ని అప్పటి మున్సిపల్ కౌన్సిల్‌లో అంబేడ్కర్ భవనం నిర్మాణం కోసం కేటాయించారని తెలిపారు. నిజానిజాలు తెలుసుకోకుండా తనను ఇబ్బంది పెట్టినందుకు బీఎస్పీ నాయకుడిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని చెప్పారు. వక్ఫ్‌బోర్డు స్థలమైతే ఆధారాలు తీసుకుని వస్తే.. తాము ఆ స్థలాన్ని వదిలిపెట్టి వెళ్తామన్నారు. దీనిపై రాజకీయాలు, మరొకరిని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయవద్దని సూచించారు. సమావేశంలో నాయకులు గంగప్ప, విల్సన్‌బాబు, బాలాజీ, కోదండ రాముడు, గంగాధర్, వీరేష్, ఉసేనప్ప తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అభ్యుదయ దళితసేవా సంఘం నాయకులు రంగన్న

వలస వెళ్లిన పిల్లలు పాఠశాలలో చేరిక



కౌతాళంలో బడిబయట ఉన్న పిల్లలతో మాట్లాడుతున్న డీఈఓ శామ్యూల్ పాల్

కోసిగి: మండలంలో అత్యధికంగా వలస వెళ్లిన 154 మంది విద్యార్థులను తిరిగి పాఠశాలలో చేర్పించినట్లు డీఈఓ శామ్యూల్ పాల్ వెల్లడించారు. శుక్రవారం మండలంలోని పల్లెపాడు, కోసిగి బాలుర ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శించి, వలస వెళ్లిన విద్యార్థులను విచారించారు. మండలంలోని ఎక్కువగా పల్లెపాడు 85 మంది, కోసిగి బాలుర ఉన్నత పాఠశాల 31 మంది, ఆదిఆంధ్ర ప్రాథమిక పాఠశాల 11మంది, మిగిలిన విద్యార్థులు వివిధ పాఠశాలలో చేర్పించినట్లు తెలిపారు. పాఠశాలలో చేరి మధ్యలో మానివేస్తే.. అలాంటి పిల్లలను గుర్తించి పాఠశాలలో తిరిగి చేర్పించుకుకోవాలని, అలాగే విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. తల్లిదండ్రులు తాత్కాలికంగా పనులకు పిల్లలను తీసుకెళ్లడంతో వారి చదువులు పూర్తి దెబ్బతింటాయన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 శోభారాణి, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఖలీల్ అహ్మద్, బందేనవాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడికి గురికాకూడదు

కౌతాళం: కౌమరదశలో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ఉండి చదువుకోవాలని జిల్లా విద్యాధికారి శామ్యూల్‌పాల్ అన్నారు. శుక్రవారం కౌతాళంలోని కస్తూర్బా పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. 9వ తరగతి గదిలో వెళ్లి విద్యార్థినులతో మమేకమై వారి సందేహాలను అడిగి తెలుసుకున్నారు. 10వ తరగతిలో పాఠాలు ఎలా అర్థం చేసుకోవాలి, ప్రణాళికలు ఎలా ఉండాలని వివరించారు. కౌమరదశలో ఎటువంటి మానసిక సంఘర్షణ, వత్తిడి లేకుండా భవిష్యత్తును ఎలా తీర్చిదిద్దుకోవాలలో వివరించారు. విద్యార్థులు వలసలు వెళ్లకుండా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. అలాగే మండలంలో వలస వెళ్లిన 15మంది విద్యార్థులను డీఈఓ వెరిఫికేషన్ చేసి ఆయా పాఠశాలల్లో చేర్పించే కార్యక్రమాన్ని చేపట్టారు.

కులమతాలకు అతీతంగా ఉరుసు

పెద్దకడబూరు : మండల పరిధిలోని పెద్దకడబూరు గ్రామ సమీపంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలసిన ఫకీర్ సాబ్ హాజీమలంగ్ బాబా షరీఫ్ ఉరుసు శుక్రవారం కులమతాలకు అతీతంగా జరుపుకున్నారు. మండల కేంద్రంతో పాటు చుట్టుపక్క గ్రామాల ప్రజలు, ఆదోని, ఎమ్మిగనూరు పట్టణ ప్రజలు, భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని గురువారం రాత్రి గంధం కార్యక్రమాన్ని జరుపుకు న్నారు. శుక్రవారం ఉదయం ఉరుసు సందర్భంగా భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతేహాలను, ప్రార్థనలను చేపట్టారు. భక్తులు నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దర్మకర్త కే.బాబు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ఘనంగా ఖాసీంసాబు ఉరుసు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలోని శివారు ప్రాంతంలో వెలసిన ఖాసీంసాబు 53వ ఉరుసు ఉత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. గురువారం రాత్రి 12గంటల నుంచి తెల్లవారుజాము వరకు గంధోత్సవం నిర్వహించారు. గ్రామంలోని జంగ్లి నబిసాబు ఇంటి నుంచి మేళతాళాలు, డప్పు వాయిద్యాల మధ్య గంధం దర్గాకు చేరిన తర్వాత ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. నిర్వాహకులు దర్గాకు గంధం పూయగా ఈరుసు ఉత్సవం ప్రారంభం అయింది. తెల్లవారు జామునుంచే భక్తులు తండోప తండాలుగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు నిర్వహకులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం నుంచి ప్రత్యేక ఖవ్వాలి పోటీలను నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో ఫకీర్ సాబ్ హాజీమలంగ్ బాబా షరీఫ్ దర్గా

ఘనంగా గోపుర కలశ స్థాపన

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని బసవన్న కొండపై వెలసిన బసవేశ్వర ఆలయ గోపుర కలశ స్థాపన వైభవంగా చేపట్టారు. రెండవ రోజు శుక్రవారం ఆలయంలో ఆలయ అర్చకులు ఉమేష్ స్వామి, ఆదోనికి చెందిన వేదపండితులు గరుడాద్రి వెంకట సుబ్బయ్య శాస్త్రి ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చరణలు పఠిస్తుండగా స్వామి వారి ఆలయ గోపురం శాస్త్రోక్తంగా స్థాపన చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులచే హోమ పూజలు, పూర్ణహుతి నిర్వహించారు.



గోపుర కలశ స్థాపన చేస్తున్న దృశ్యం

అక్రమ మద్యం పట్టివేత

గోనెగండ్ల : మండల పరిధిలోని అలువాల గ్రామంలో అక్రమంగా కర్ణాటక మద్యం అమ్ముతున్న పిచ్చిగుంట్ల కృష్ణ, అతనికి మద్యం సరఫరా చేస్తున్న సి.బెళగల్ గోపాల్‌ను అరెస్టు చేసినట్లు సీఐ విజయ భాస్కర్ తెలిపారు. శుక్రవారం పోలీసులకు సమాచారం అందడంతో అలువాల గ్రామంలో పిచ్చిగుంట్ల కృష్ణ ఇంటికి వెళ్లి సోదాలు చేయగా అక్కడ కర్ణాటకకు చెందిన 39 మద్యం బాటిళ్లు, ఆంధ్రకు చెందిన రెండు మద్యం బాటిళ్లు దొరికాయన్నారు.

అన్నా క్యాంటీన్ పరిశీలన

ఆదోని టౌన్: పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లోని అన్నా క్యాంటీన్‌ను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ తనిఖీ చేశారు. అన్నా క్యాంటీన్‌లో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం నాణ్యతా ప్రమాణాలపై ఆరా తీశారు. అక్కడికి వచ్చిన పేదలను అడిగి .. నాణ్యతగా భోజనం, అల్పాహారం వడ్డిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు.